క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా గరుడసేవ


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడ సేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం ఈ సేవను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేష హారతులిచ్చారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

అప్పన్న రథసారథికి ఆహ్వానం


రథసారథి కదిరి లక్ష్మణరావుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఏఈవో

సింహాచలం: ఈ నెల 8న చైత్రశుద్ధ ఏకాదశి పురస్కరించుకుని జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించే రథోత్సవానికి విచ్చేసి రథసారథి బాధ్యతలు నిర్వర్తించాలంటూ జాలారి పెద్ద కదిరి లక్ష్మణరావుకు సింహాచలం దేవస్థానం ఆహ్వానం అందించింది. 98వ వార్డు పరిధి శ్రీనివాసనగర్‌లో ఉంటున్న లక్ష్మణరావు ఇంటికి దేవస్థానం ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ వెళ్లి ఆహ్వానపత్రిక అందించారు. రథసారథిగా నిలిచి రథోత్సవాన్ని విజయవంతంగా జరిపించాల్సిందిగా కోరారు. దేవస్థానం తరపున శేష వస్త్రం, ప్రసాదం అందించారు. 1963 నుంచి కదిరి లక్ష్మణరావు రథోత్సవంలో రథసారథిగా బాధ్యతలు వహిస్తున్నారు.

వాచ్‌మెన్‌కు ఆర్థిక సాయం


వాచ్‌మెన్‌కు నగదు అందిస్తున్న నరసింగరావు

పరవాడ: పెదముషిడివాడ జెడ్పీ హైస్కూల్లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పావడ అప్పలస్వామి కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న జనసేన నాయకుడు కరణం నరసింగరావు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు బుధవారం అందించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్ పాస్‌ల జారీ


దివ్యాంగులకు బస్ పాస్‌లను జారీ చేస్తున్న ఆర్టీసీ అధికారులు

పరవాడ: స్థానిక భవిత కేంద్రంలో బుధవారం జాతీయ ఆటిజం అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన మండల విద్యాశాఖ అధికారి జి.సాయిశైలజ మాట్లాడుతూ దివ్యాంగులకు ఆటిజం జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 25 మంది దివ్యాంగుల ధ్రువపత్రాలను పరిశీలించి అనకాపల్లి ఆర్టీసీ డిపో అధికారి సీహెచ్ ధనలక్ష్మి బస్ పాస్‌లను జారీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సిబ్బంది వైవీఎస్ కుమార్, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాస్, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, దోసూరు, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం పంచాయతీలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. తమ సిబ్బందికి వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 9 మందికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.90 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. బుధవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా.. జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వలసల్ని నియంత్రించాలి. ఉన్న ఊర్లోనే ఏడాదిలో కనీసం వంద రోజుల ఉపాధి కల్పించాలి. ప్రజల జీవనోపాధిలో భద్రతకు కేంద్రం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది. అయితే నెలల తరబడి ఉపాధి వేతనాలు రాకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. సబ్బవరం మండలంలో 3 నెలలుగా ఉపాధి కూలీలకు వేతనాల్లేవు. దీంతో ప్రత్యామ్నాయ ఉపాధికి మళ్లీ వలసబాట పట్టాల్సి వస్తోంది.

- మూడు నెలలుగా ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- ప్రభుత్వం నుంచి విడుదల కాని ఉపాధి నిధులు
- మండలంలో 80 వేల పని దినాలకు నిలిచిన చెల్లింపులు
- రూ.2 కోట్లకు పైనే చెల్లించాల్సిన బకాయిలు
- ఇల్లు గడవక ప్రత్యామ్నాయ ఉపాధి వైపు కూలీలు


రాయపుర అగ్రహారం శేషమాని చెరువులో ఫిష్ పాండ్ తవ్వుతున్న ఉపాధి కూలీలు



చెరువు గట్టు వేస్తున్న ఉపాధి కూలీ

ఉపాధి కల్పన వేతనం కల్ల

మండలంలో గ్రామ పంచాయతీలు	మండలంలో మొత్తం జాబ్ కార్డులు	సగటున ఉపాధి పనులకు వెళ్లే కూలీలు
24	12,551	2,100 మంది

యాక్టివ్‌గా ఉన్న జాబ్ కార్డులు	బిల్లులు చెల్లించాల్సిన పనిదినాలు	బకాయి పడిన ఉపాధి వేతనాలు
7,333	80 వేలు	రూ.2 కోట్లు పైనే

సబ్బవరం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబంలో పనిచేసేందుకు ముందుకొచ్చే వారికి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం పని కల్పిస్తోంది. స్థానికంగా ఉంటూ వ్యవసాయ పనుల్లేని సమయంలో ఈ పథకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. అయితే వేతన బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యంతో కూలీలు నానా యాతన పడుతున్నారు. ఒకవైపు పని దినాలు కనీసం 200కు చేర్చాలన్న డిమాండ్ ఉన్న తరుణంలో వేతన చెల్లింపులు సక్రమంగా చేయకపోవడంతో ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న ఊళ్లో పని చేసుకుంటూ కలోగంజో తాగి బతుకుదామన్నా వీల్లేకుండా పోతోందని వాపోతున్నారు.

లక్ష్యాన్ని మించి పని చేసినా..

సబ్బవరం మండలంలో 24 గ్రామ పంచాయతీలున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 4,34,017 పనిదినాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. 100.6 శాతంతో 4,35,699 పనిదినాలతో లక్ష్యాన్ని మించి పని చేశారు. ఈ సంవత్సరం జనవరి రెండో వారం నుంచి ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. మండలంలో సుమారు 80 వేల పనిదినాలకు గాను సగటున ఒక్కో పని దినానికి రూ.250 చొప్పున రూ.2 కోట్లకు పైనే బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ కొత్త ఆర్థిక సంవత్సరంలో అదనంగా మరో 4,34,017 పని దినాలు లక్ష్యంగా పెట్టుకుని ఉపాధి కూలీలు ముందుకు సాగుతున్నారు.

పనులు వెతుక్కోవాల్సి వస్తోంది!

ఉపాధి పనులకు వెళ్లే ఉపాధి కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారుతోంది. సబ్బవరం మండలంలో జనవరి 2వ వారం నుంచి ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించలేదు. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి పనులకు వెళ్లే చాలా మంది కూలీలు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు వెతుక్కుంటున్నారు. దొరికిన పని చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. మరికొన్ని చోట్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో పనులు వెతుక్కుంటూ వలస బాట పడుతున్నారు.


వంగలి రెవెన్యూ పరిధిలో ఫాం పాండ్ తవ్వుతున్న ఉపాధి కూలీలు

ఇల్లు గడవక..



ఇల్లు గడవడంతో పాటు కుటుంబ అదనపు అవసరాల కోసం ఉపాధి పనులకు వెళ్తుంటా. వారాలుగా బిల్లులివ్వట్లేదు. అధికారులను, క్షేత్ర స్థాయి సిబ్బందిని అడిగితే త్వరలోనే చెల్లిస్తామంటున్నారు. వేరొక పనిలోకి వెళ్లలేకే ఈ పరిస్థితి.
– పిల్లల లక్ష్మి, రాయపుర అగ్రహారం

సగం మంది మాత్రమే..



మా మణికంఠ గ్రూపులో 45 మంది ఉపాధి కూలీలున్నారు. 9 వారాలుగా వేతనాలివ్వట్లేదు. దీంతో ప్రస్తుతం 23 మంది మాత్రమే పనులకు వస్తున్నారు. మిగిలిన వారు వేరే పనులకు వెళ్లిపోతున్నారు. నేను ఆ పనులకు వెళ్లలేకే ఉపాధి పనులు చేస్తున్నా.
– బిక్కోలు నరసింగరావు, రాయపుర అగ్రహారం

బకాయిలు రూ.4 కోట్లు



మండలంలో ప్రస్తుతం ఉపాధి కూలీలకు రూ.4 కోట్లు వరకు బకాయి వేతనాలున్నాయి. అధికారులు చెప్తున్నది చాలా తక్కువ. బకాయిలు చెల్లించేలా ఎంపీడీవోతో పాటు ఏపీవో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి.
– ఉప్పాడ సత్యవతి, జిల్లా అధ్యక్షురాలు, వ్యవసాయ కార్మిక సంఘం

కలెక్టర్‌కు నివేదించాం



ఉపాధి కూలీలకు బకాయిలు ఉన్నాయి. వారి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల జిల్లా కలెక్టర్‌కు సమస్యను వివరించాం. త్వరలోనే ఉపాధి కూలీల బకాయి వేతనాలను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.
– పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం మండలం

సూర్యనారాయణ మాస్టారి సేవలు మరువలేనివి


సూర్యనారాయణ మాస్టారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గుడివాడ అమర్‌నాథ్

పెందుర్తి: ఉపాధ్యాయుడిగా జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు పొందిన బయిలపూడి సూర్యనారాయణ(మాస్టార్) సేవలు కొనియాడదగినవని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఇటీవల మరణించిన సూర్యనారాయణ మాస్టారి సంస్మరణ సభ మండలంలోని పినగాడిలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు, అమర్‌నాథ్ మాట్లాడుతూ పెందుర్తితో పాటు జిల్లాలో కూడా మాస్టారు విద్యారంగానికి ఎంతో సేవ చేశారన్నారు. ముందుగా మాస్టారి కుమారుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయిలపూడి భగవాన్ జయరాం, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయ్‌కుమార్, కరణం ధర్మశ్రీ, చింతలపూడి వెంకటరామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని మాస్టారి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

సీతారాముల కల్యాణోత్సవానికి పందిరి రాట


రాట మహోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు

పరవాడ: మండలంలోని పరవాడ గ్రామంలో ఈ నెల 6న నిర్వహించనున్న శ్రీరామనవమి మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం పందిరి రాట వేశారు. పరవాడ ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రామాలయంలో సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగనుందన్నారు. ఆ రోజు మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం గ్రామ పురవీధుల్లో పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రాట మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, గ్రామ పెద్దలు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, గండి ఈశ్వరరావు, పైల అప్పలనాయుడు, సత్యవేణి, అయ్యబాబు, పైల అప్పారావు, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినిగా కుమారి సేవలు ప్రశంసనీయం


ఉద్యోగ విరమణ చేసిన కుమారి దంపతులను సత్కరిస్తున్న మండలంలోని ఉపాధ్యాయులు

సబ్బవరం: ఉపాధ్యాయ వృత్తిలో డీఎంబీ కుమారి అందించిన సేవలు మిగిలిన ఉపాధ్యాయులకు ఆదర్శమని ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. మండలంలోని వెదుళ్లనరవ కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి, మార్చి 31న ఉద్యోగ విరమణ చేసిన కుమారిని స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువ, గౌరవంతో కూడుకున్నదన్నారు. తొలుత ఉపాధ్యాయులంతా ఉద్యోగ విరమణ చేసిన డీఎల్‌బీ కుమారి దంపతులను పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శాలువాలు వేసి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.పద్మజ, ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరావు, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు అప్పలనాయుడు, వనం భాస్కరరావు, యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తమ్మారావు, కేవీ రమణ, ఏపీటీఎఫ్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి


రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక గ్రామంలో త్వరలో నిర్వహించనున్న రీ సర్వేను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని ఆరిపాక గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లో భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం రెండో విడత రీ సర్వే పకడ్బందీగా నిర్వహిస్తోందన్నారు. రైతులు తమ భూముల సరిహద్దులతో పాటు, భూ హక్కు పత్రాలను సర్వే అధికారులకు విధిగా చూపించి సహకరించాలన్నారు. ముందుగా గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాలిశెట్టి సురేష్‌రాజ్, శరగడం రాము, శరగడం శంకరరావు, బి.మహాలక్ష్మినాయుడు, డీటీ గణపతిరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, వీఆర్వో అప్పలరాజు, ఆదారి నాగరాజు, సత్యనారాయణరాజు, వెంకట్, కాళ్ల శ్రీనుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక.. ఆత్మీయ వేడుక


50 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

పెదగంట్యాడ: పూర్వ విద్యార్థులు సందడి చేశారు.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.. ఆత్మీయ ఆలింగనం చేసుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి చిలిపి చేష్టలను, అప్పటి ఆకతాయి పనులను అపురూప జ్ఞాపకాలుగా నెమరువేసుకున్నారు. గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975–76లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు గాజువాక బీసీరోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. తమ ఎదుగుదలకు కారణమైన స్కూల్‌కు, సమాజానికి ఎంతో కొంత సాయపడేలా సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని నిర్ణయించారు. 50 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం ఈ వయసులో మరుపురాని జ్ఞాపకం అని సంతోషం వ్యక్తం చేశారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో గానాల బ్రహ్మం, ఉడా వెంకట శ్రీనివాసరావు, బోయి పెరిరెడ్డి, ఈశ్వరరావు, జిలకర్ర రమణ, కుంచారావు, వై. తాతారావు, దేవి తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ్' జాబ్ మేళాలో 12 మంది ఎంపిక


మాట్లాడుతున్న థియోఫిలాస్

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 32 మంది పాల్గొనగా 12 మంది ఎంపికయ్యారు. హనీ గ్రూప్ సంస్థ నిర్వహించిన జాబ్‌మేళాలో వీరు ఉపాధి పొందినట్లు కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలాస్ తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్.ఇ.ఫ్లోరా చేతుల మీదుగా నియామకపత్రాలు అందించారు. ఎంపికైన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి కమలారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, సిబ్బంది ఎం.వి.నాగమణి, డి.టి.రమ్య, పి.వి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నతస్థాయి

- డ్రగ్స్, బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ


సీపీని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

పెందుర్తి: ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ చాలా అవసరం అని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. యుక్త వయసులో డ్రగ్స్, బెట్టింగ్ యాప్‌లకు అలవాటుపడితే జీవితం నాశనమవుతుందని హెచ్చరించారు. నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో 'నవసమాజ నిర్మాణం'పేరిట బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మాదకద్రవ్యాలు వినియోగించడం, అమ్మడం నేరమన్నారు. నేరాలకు పాల్పడితే జీవితాంతం జైల్లో గడపాల్సిన దుస్థితి వస్తుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి చేరుకుంటే మంచి భవిష్యత్, తల్లిదండ్రులకు కూడా సమాజంలో చక్కటి గుర్తింపు వస్తుందని సూచించారు. డ్రగ్స్, మద్యపానం, ధూమపానం చేయడంతో పాటు ఆర్థిక నేరాలకు పాల్పడితే జరిగే చెడును పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జోన్–2 డీసీపీ డి.మేరీప్రశాంతి, వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ ఏ.బి.పృథ్వితేజ, పెందుర్తి సీఐ కె.వి.సతీష్‌కుమార్, కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.ప్రదీప్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ధూళి ఎగసిపడి.. లారీని ఢీకొని..

బుధవారం ఉదయం లంకెలపాలెం–సబ్బవరం రహదారి పెదముషిడివాడ సమీపంలో బైక్(ఏపీ 40 బీజెడ్ 9323)పై వెళ్తున్న ఓ గుర్తు తెలియని యువకుడు గ్యాస్ సిలిండర్ లారీని బలంగా ఢీకొట్టి, తీవ్రంగా గాయపడ్డాడు. యువకుడి ముఖం, తల, కాళ్లకు గట్టి దెబ్బలు తగిలాయి. ఈ ప్రాంతంలో బూడిద లారీల రాకపోకల కారణంగా రోడ్డుపై దుమ్మూధూళి భారీగా పేరుకుపోయింది. దీంతో లారీ వెనుక బైక్‌పై వెళ్తున్న యువకుడు రోడ్డుపై ఎగసిపడుతున్న బూడిద కారణంగా ఎదురుగా వస్తున్న గ్యాస్ సిలిండర్ల లారీని గుర్తించలేకపోయాడు. గాయాలపాలై రోడ్డుపై కదల్లేని స్థితిలో ఉన్న ఆ యువకుడిని స్థానికులు ఆటోలో ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. ఆస్పత్రి నుంచి కూడా ఎంఎల్‌సీ రిపోర్టు రాలేదన్నారు. బూడిద లారీల వల్ల తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
– పరవాడ


తీవ్రంగా గాయపడిన యువకుడు


ఇలా రేగుతున్న ధూళి మధ్యలో వెళ్తూనే ప్రమాదం


ప్రమాదానికి కారణమైన గ్యాస్ సిలిండర్ల లారీ